# మచ్చలు

శ్రీమతి ఆర్. వసుంధర



తెల్లవారింది. నిద్రనుంచీ మెలకువ వచ్చినా ప్రక్క మీదనుంచీ లేవాలని బుద్ధిపుట్టలేదు. రోజూ అంతే. ముందుగా లేచి పాపకూ, బాబుకూ పాలు కాచిపెట్టి, మా యిద్దరికీ కాఫీపెట్టి వాళ్ళు లేచేసరికి, ఏడుగంటలకంతా తయారుగా వుండాలి. రోజూ ఆ వేళకు 'ఏం, కాసేపు ఆలస్యమైతే' అనిపిస్తుంది. నాకు ఏ జబ్బోచేస్తే ఏమౌతుందేమిటి? అప్పుడెల్లా జరుగుతుంది? ఏడు గంటలకు పాలూ, కాఫీ లేవని ముగ్గురూ వెర్రిగంతులు వేసుకుంటారు కాబోలు—అనుకున్నాను. నవ్వు వచ్చింది.

జబ్బుమాట గుర్తుకొచ్చేసరికి అప్రయత్నంగానే చేతి వ్రేళ్ళు చూసుకున్నాను. ఎడమచేతివ్రేళ్ళకూ, కుడిచేతివ్రేళ్ళకూ నిన్న ఎంత భేదం వుందో యివాళా అంతేవుంది. ఈ మధ్యన ఏమంత తేడా రాలేదు.

కొంచెం వచ్చిందా?

ఏమో!

ఎడమచేతివేళ్ళు సన్నగా వుంటాయి. కుడిచేతివేళ్ళ కణుపులదగ్గర కాస్త మొద్దుబారి నట్లుగా మచ్చలతో వుంటాయి. వాటిని చూసినాకు ఎప్పుడూ అనుమానం వస్తూ వుంటుంది—కుష్ఠువ్యాధి ఏమైనా ప్రథమదశలో వుందేమోనని. దానికీ ముందుగా కణుపులు మొద్దుగా అవుతాయని విన్నాను.

కుష్ఠువ్యాధిఅంటే నాకు చాల అసహ్యం. ఎక్కడచూసినా ఆ చీదర మొహాలే యీ చిత్తూరునిండా. అబ్బ, తలచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది! వీడికి వేలులేదు. దానికి కాలులేదు. వాడి చేతులనిండా పొడలాగా మచ్చలు! ఛీ, ఛీ. దేశంలోవుండే కుష్ఠు వాళ్ళకందరికీ అడుక్కోవటానికి యీ వూరే దొరికినట్లుంది—ఆ దరిద్రపు రోగం వూరంతకీ అంటించడానికి! వీళ్ళందర్నీ కట్టగట్టి తగలేస్తే పీడా వదిలిపోతుంది!

అట్లా అంటే వూరుకోదు లోకం. సానుభూతి, సానుభూతి— ఏదీ నీ సానుభూతి? అని కేకలేస్తుంది.

నాకు లేదు సానుభూతి.

అందుకని వన్ను కూడా తగలేస్తారా?

ఏమిటో పాడువ్రేళ్ళు—యీ కుడిచేతివేళ్ళు—మొద్దుగా యింతకీ కారణం ఆ వెధవ్వంటే! ఆవాలూ, పచ్చిమెరపకాయలూ పెటపెటలాడి నామీదే చిందుతాయి. ఆవిరి ఎక్కడనుండీ బయటకొచ్చినా నా చెయ్యి అక్కడేవుంటుంది ఎలాగో. గంజి వార్చితే అదీ అయస్కాంతం దగ్గరికి పరుగెత్తుకొచ్చే యినుప ముక్కలాగా నామీదికే వస్తుంది. పాలు పొంగుతూవుంటే పాత గుడ్డ చుట్టుప్రక్కల్లో వుండదు గిన్నెదించటానికి. మొదట్లో చెయ్యి కాల్తుందని భయపడి, ఏం చెయ్యాలో తెలియక, పాల పొంగునీ గిన్నెనీ పొయ్యినీ కూడా ముట్టుకున్నాను.

యిప్పు డట్లా చెయ్యను. ఎదురుగ్గా నిలుచుని 'ఫో! పాడు పాలూ, నీ యిష్టం వచ్చినట్లు పొంగి చావు!' అనుకుంటాను. నీళ్ళు దగ్గర్లోవుంటే చల్లుతాను. లేకుంటే లేదు. పొంగు పొయ్యిలో పడి పొయ్యి ఆరిపోతే, అదేపోతుంది పొంగు.

యింతకూ ఆ వెధవ్వంటంటే నాకు సరిపడదు. మా అమ్మ నాకు నేర్పలేదు. ఆవిడ చాలా Enlightened మనిషి—బాగా చదువుకుంది - అన్నీ తెలుసు ఆమెకి—హ, హ, హ చాలా తెలిసిన మనిషి మా అమ్మ!

అందుకే మా నాన్నని పెళ్ళి చేసుకుంది. మా నాన్న డెప్యూటీ కలెక్టరుగా చాలా ఏళ్ళువుండి రిటైరయ్యారు. కలెక్టరుగా ప్రమోషన్ రాలేదు. ఎప్పటికైనా కలెక్టరు భార్య నౌతానని అనుకునివుంటుంది. హ, హ, హ, ఎంతతెలిసినావిడైనా ఆయన కర్మని నడిపే శక్తి లేదుగా! లంచాలు ఏమంతగా తీసుకోకపోయినా కర్మచాలక ఆ తీసుకున్న కొద్దిపాటివే బయట కొచ్చి బ్లాక్ మార్కు పడింది మా పితృదేవులకు. మా అమ్మ హ, హ, అంత తెలిసీ చదువుకొనీ దీనికి ఏం చేస్తుంది? బ్రూటస్ పొడిచినప్పటి సీజర్‌లాగా గుండెల లోపలికి లోతుగా దెబ్బతిని వుంటుంది. తినటమూ మంచిదే. ఎదురు దెబ్బలు తగులుతూవుంటే జ్ఞానం, వేదాంతం అన్నీ తెలుస్తాయంటారు గదా!

మమ్మల్నిద్దర్నీ—నన్నూ, సూర్యాన్నీ—చాలా జాగ్రత్తగా పెంచింది ఆమె. జాగ్రత్తగా ఆలోచించి కన్నదికూడా. ఆవిడే చెప్పింది. Facts of Life — జీవిత సత్యాలు—యుక్త వయస్సు రాగానే నాకు చెప్పినప్పుడు. తర్వాత సూర్యానికీ చెప్పివుంటుంది—వాడు మగవాడు ఎందుకయ్యాడో నేను ఎందుకు కాలేదో. Effeminate వెధవ—అణంగి కోణంగి—వాడికి అమ్మ చెప్పేదాకా ఏమీ తెలిసుండదు.

మూలశంకకు
త్వరగా,నమ్మకమైన
హెడెన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా! తీవ్రంగా దురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స ఎంతమాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారితీసి- శస్త్ర చికిత్స తప్పనిసరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేపనము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసు చేస్తున్నారు. హెడెన్‌సా శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది—విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు. హెడెన్‌సాలో ఉండే అమోఘమైన మందులు సామర్థ్యంగా గుణాన్ని కలిగించి రక్తశంకలను ముకుళింపజేసి ఆరోగ్యకరమైన టిస్యూ రంధ్రాలప్రవృద్ధికి సహకరిస్తుంది. గమనించండి. మూలశంకలకు సకాలంలో హెడెన్‌సా చికిత్సచేసుకుంటే ముందుముందు శస్త్ర చికిత్స అవసరముండదు! హెడెన్‌సాలో మత్తును కల్గించే మందులు ఏమియు లేవు.

అసలైన జర్మన్ సూత్రాలకు అనుగుణంగా ఇండియాలో వీరిచే తయారు చేయబడుచున్నది.

ది డాలర్ కంపెనీ
337, తంబుచెట్టి స్ట్రీటు మద్రాసు-1.
ప్రసిద్ధి పొందిన కెమిష్టు లందరివద్ద లభిస్తుంది.

83-DOL-2A TG

బుద్ధిమంతుడువాడు—ఎప్పుడూ బుద్ధిగా చదువుకోవటమే పని. అందుకే అమ్మకీ, నాన్నకీ ముద్దుల కొడుకు వాడు.

అంతా Hypocrisy. చదువుతప్ప ఏమీ తెలియకుండా వుండటం మాంఛి బుద్ధి అవుతుందా? మిగతాదంతా తప్పయినట్లు, ప్రపంచంలో యింకేమీ లేనట్లు! ఆవిడ నాన్న దగ్గరికి వచ్చినప్పుడంతా కళ్ళు మూసుకొని ఏమీ జరగటం లేదనుకొనివుంటుంది. మేము ఆవిడ తల్లోంచీ పుట్టాం—తలకాయలోంచీ!

లోకమంతా ప్లాను ప్రకారం నడుస్తుంది ఆవిడకి—ఇండియా, పంచవర్ష ప్రణాళికల ప్రకారం నడిచినట్లు! మన గవర్నమెంటుకంటే ఆమే తెలివైంది. పెళ్లయినాక అయిదేళ్లకి నన్ను కనాలనుకుని కన్నది. తరువాత అయిదేళ్లకి వాడిని, సూర్యాన్ని కనాలనుకుని కన్నది. ఆ తరువాత వద్దనుకుని మానేసింది.

నన్నూ అట్లాగే కనమని చెప్పింది నేను పెళ్లిచేసకున్నాక. నేను విననని తెలుసు. బాధ్యతవుంది గనుక చెప్పింది. అసలు నేను పెళ్లి చేసుకోవటం ఆవిడ ప్లానును భగ్నం చెయ్యాలని చేశాను. కాదు, నేను పెళ్లి చేసుకోవటం ఆవిడ ప్లానును దెబ్బతీసింది.

నాకు పదిహేనేళ్లు రాగానే, ఆవిడ యింకా నేను పసిపిల్లనని ఫ్రాకులూ, పరికిణీచొక్కాలూమధ్య వూగిసలాడుతుండగానే ప్రక్కయింటి మేడమీద అబ్బాయిని ప్రేమించి ఉత్తరాలు రాశేశాను. ఆ యబ్బాయినితప్ప యింకోళ్లని చేసుకోనని మొండిపట్టు పట్టాను. వూరంతా గోలయిపోయి ఆవిడ దిగిరాకతప్పలేదు. అప్పటికీ చేతనయినంతా చెప్పిచూసింది. మంచి ఇంజనీరుకో, డాక్టరుకో యిచ్చి చేస్తానన్నది. అప్పుడు డబ్బాబ మనుష్యులూ పుష్కలంగా వుంటారు, రాజభోగంవుంటుంది. బి. ఏ. పాసు కాలేక తప్పుతూ కట్టుతూ తప్పుతూవుండే బడుద్ధాయిని చేసుకుంటే తరువాత నానాపాట్లూ పడతాను. వాకబుచేస్తే ఆ యబ్బాయికి ఆస్తి కూడా లేదని తెలిసింది. అప్పుడు ఆవిడ ఆరాటం, బాధ చూస్తుంటే నాకు లోపల మహా సంతోషం కలిగింది. నా కోసరమా యీ ఆరాటం? తన తలకాయలోని కూతురికోసం. నన్ను ఇంజనీరుకిస్తే యీవిడ హోదా పెరుగుతుందట, ఎట్లానో!

అంత జాగ్రత్తగా పెంచిన నేను యిట్లా తయారుకావటం ఆవిడకి అర్థం కాలేదు. ఎంత ప్లాను ప్రకారంచేసింది అన్నీ! ఫ్రాయిడ్ కాంప్లెక్సులూ, ఆడ్లర్ కాంప్లెక్సులూ అన్నీ చదివి మరీ పెంచింది. నేను చేసే ప్రతి పనికీ, మాట్లాడే ప్రతిమాటకూ వెనుక ఏం కాంప్లెక్సువుందోనని వెతికి వెతికి జాగ్రత్తపడేది. అమ్మా, నాన్నా చీకటితప్పును ఏ నిద్రలోనో గభాల్న లేచిచూస్తే— సగం నిద్రలో, మసగ్గా—అప్పుడు గొప్ప ఫ్రాయిడ్ కాంప్లెక్సు వస్తుందట. ఆ సూర్యం గాడు

అట్లాగ వున్నాడేమిటని చిన్నప్పుడు అడిగితే అదిరిపోయింది. తరువాత అన్నీ వివరంగా చెప్పింది.

ఆఖరికి నా సంగతి బాగా తెలిశాక, ఎంతో ఆలోచించి యిదంతా ఆడ్లర్ చెప్పినట్లు మొదటి బిడ్డలకువచ్చే Dethronement—రాజ్య పదవీ భ్రష్టత్వం—తాలూకు కాంప్లెక్సు అని నిశ్చయం చేసుకుంది. సూర్యాన్ని యింకొంచెం, యింకో అయిదేళ్లు ఆలస్యంగా కనివుంటే బాగుండేది. పొరపాటై పోయింది అని నాన్నతో చెప్తుంటే విన్నాను. నాన్న ఒప్పుకున్నారు. ఒప్పుకోక ఏం చేస్తారు గనుక—కలెక్టరన్నా కాలేక పోయాక!

సూర్యంగాడు అవుతాడేమో కల్టెకరు—బుద్ధిగా చదువుకొంటున్నాడు. మా ఆయనకు తనకు తెలిసిన వాళ్ళద్వారా కలెక్టరాఫీసులో గుమాస్తాపని యిప్పించారు నాన్న. ఆరేళ్లనుంచీ గుమాస్తాగా వుంటున్నారు. మొదటి రెండేళ్లలోనే బాబినీ, పాపనీ కనేశాను. తరువాత ఓపికలేక మానేశాను. పిల్లలతో మహా చీకాకు— అమ్మా పాలు—దొడ్డికి పొయ్యి వచ్చేశానే—ఒకటి కొస్తున్నాయే — ఇద్దరితో పడేసరికి గందరగోళం అయిపోయింది. ఆయాలూ వంట మనుష్యులూ వుండటానికి ఆయవ కలెక్టరాఫీసులో గుమాస్తాయేగదా.

అప్పుడే ఆయనవెళ్లి తలుపుతీసి వచ్చివుంటారు. పని మనిషి పాలు లోపలపెట్టి అంట్లు తోమేసి వుంటుంది.

ఈ కుడిచేతివేళ్లకివుండే మచ్చలు ఆవిరి తగిలిన తాలూకా లేక కుష్ఠుపొడలా అని తెలియలేదు, దేవుడున్నాడా లేడా అని తెలియనట్లు. ఒక్కోరోజున అవి కుష్ఠుమచ్చలే ననుకుంటాను. ఆరోజున పాలుపొంగిపోతై. చేతులుకాలి తీరతై. పిల్లలు మహా చీరాకుపెట్టి తిట్లూ దెబ్బలూ తిని ఏడుస్తూవుంటారు. వాళ్లు ఏడుస్తే నేనూ ఏడుస్తాను. ఎందుకంటే వాళ్ల నా దగ్గరకేవచ్చి నన్ను పట్టుకొని అమ్మా అని ఏడుస్తారు గనుక. అట్లా ఏడవటం చాలా ఉదాత్తంగా వుంటుందిగనుక.

ఒక్కోరోజున అవి ఒఠ్ఠి ఆవిరి మచ్చలే అనుకుంటాను. ఆరోజున చాల ఉల్లాసంగా వుంటుంది. డబ్బుంటే పిల్లల కేమైనా పిండివంట చేస్తాను. ఆయన ఆఫీసులో కష్ట పడ్డందుకు సానుభూతి కూడా చూపిస్తాను. నా సానుభూతితో ఆయనకేం పనిలేదు. నేను తిట్టినా సానుభూతి చూపించినా ఒకటేగా చిరునవ్వు సమాధానం. ఏమీ తెలియదు. వఠ్ఠి గుమాస్తా.

ఇవాళ ఆ మచ్చలు కుష్ఠుపొడలాగే కన్పిస్తున్నాయి. నిన్ననే నాన్న ఉత్తరం వ్రాశారు తిరుపతినుంచీ. దగ్గర్లోకి వచ్చాం గనుక ఒక్కసారివచ్చి వారంరోజులుండి పొమ్మని. సూర్యంగాడు యం. యస్సీ.లో చేరాడట. హాస్టల్లోవుంటే ఆణంగి వెధవ కందిపోతాడని ఒచ్చారు. దీపావళి దగ్గరకొచ్చింది. ప్రతిపండగకీ రమ్మని వ్రాస్తారు విధాయకంగా. పెళ్ళయి ఆరేళ్లవుతున్నా యింతవరకూ ఒక్కసారికూడా పుట్టింటికి వెళ్ళలేదు నేను. నాకు బస్సులూ, రైళ్లూ యిష్టంలేదు.

కాన్పులక్కూడా చివరిదాకా ఎటాగో గడిపేసి, ఆస్పత్రిలోచేరి కనేసి యింటికొచ్చాను. తెలిపాక మొదటిసారి అమ్మ వచ్చి పదిరోజులుండిపోయింది. రెండోసారి ఆయన స్నేహితుల తాలూకు వారంరోజులసాయం వుండింది. అప్పట్నుంచీ మళ్లీ పని, పని. ఆయనా సగం చేస్తారు పని—అర్ధరాత్రి పిల్ల ఏడిస్తే పాలుపట్టడం, ఉచ్చగుడ్డలు మార్చటంలాంటివి. గుమాస్తాఅయి చెయ్యకేం చేస్తారు—ఏం కలెక్టరా?

'అమ్మా, లేమ్మా—పాలివ్వవే' బాబు గోల ప్రారంభించాడు.

నాకు పెద్దరోగం వస్తుంటే వీడికి పాలు కావాలిట. వెధవ!

'కాసేపున్నాక యిస్తాలే, ఫో' అన్నాను.

వీధిలోకి పరుగెట్టాడు.

అసలు యీ గోలపిల్లలు, పాడుపిల్లలు లేకుంటేనేం? న్యూసెన్సుతప్ప మరేమన్నా పాసిటివ్ లక్షణం వుందా? నాక్సగం రోగం వీళ్లనుంచీనే పుట్టుకొస్తోంది. వాడికీ పూర్తి attention కావాలి. దానికీ పూర్తి attention కావాలి. వంటకీ పూర్తి attention కావాలి. ఆయన గుమాస్తా గనుక, అక్కర్లేదు గనుక, సరిపోయింది. నేను ఒక్కదాన్ని, మూడు పూర్తి attention లు ఎట్లాగ supply చేస్తాను? అదే రోగం!

ఇప్పుడు గభాల్న వీళ్ల లేకుండాపోతే? దొంగలెత్తుకు పోతే—రోగమొచ్చి పోతే—

అప్పుడు గోలేవుండదు. ఇల్లంతా ప్రశాంతంగా వుంటుంది. నేను తొమ్మిది గంటలకు నిద్రలేస్తాను!

"ఢాం"

అబ్బ, ఏమిటది? ఒళ్లే అదిరిపోయింది. పిడుగుపడ్డదా ఏమిటి? మబ్బులూ, మెరుపులూ లేకుండానే? ఎంత పెద్ద శబ్దం!

అది కాస్తా లేచేసింది. ఇహ గోల మొదలు. ఇంకాస్సేపు నిద్రపోతే ఏం మునిగిపోతుంది?

అబ్బ, ఒళ్లు అదురు తగ్గనేలేదు.

"ఏమిటండీ ఆ శబ్దం?"

"ఇదుగో, చూసొస్తా.....ఏదో పెద్ద టపాకాయ వేసినట్లున్నారు'.

"అమ్మా, అమ్మా......పిల్లకాయలు డబ్బాలో మందు పొడి పెడితే పేలిపోయిందంట. మన వాకిటిముందే...... నలుగురో ఏమో పొయ్యారంటుండారు" పనిమనిషి లక్ష్మి.

'ఒళ్ల అదిరిపోయిందే......మన వాకిటిముందేనా?'

'మన బాబిగాడేడీ, రాధా?'

'అయ్యో, అయ్యో, వాడు బయటికి పోయాడండీ. అట్లా చూడండీ.....లక్ష్మి పోయిరావే......అయ్యో నా నాయనా, నా బంగారుస్వామీ......నా చందమామా......'

'వుండు, వుండు, నేను చూసొస్తాను......ఖంగారు పడకు' ఆయన ఖంగారుగా బయటికి వెళ్తున్నారు.

'అమ్మా, బయటే......వాళ్ల చచ్చిపోయారే' బాబిగాడు భయపడి లోపలికి వచ్చాడు.

'వెధవా, నన్ను వూరికే హడలగొడితివిగదరా.....నిన్ను చంపేస్తానుండు........' వాడిని చంపటానికి ప్రక్కమీది నుంచీ లేచాను.

ఆయన వచ్చి పట్టుకున్నారు. 'రాధా, వూరుకో..... వాడసలే భయపడిపోయివుంటే........'

ఆయన భుజమ్మీద వాలిపోయాను. వూరికే ఏడుపొచ్చింది........ఆపుకోలేకుండా......

ఆయన నా వీపుమీద చిన్నగాతట్టి 'కాసేపు కూర్చో... అదేపోతుంది.........భయపడ్డావు......' అన్నారు.

'కాదండీ......నాకు......నాకు..... చేతివేళ్లకు మచ్చలు వచ్చాయండీ.......కుష్ఠురోగమో ఏమో' అంటూ ఏడిచాను.

'డాక్టరు దగ్గరకుపోయి చూపెట్టుకుందాంలే ..ఏడవబోకు.....వూరికే భయపడితే ఎట్లా?... ' అన్నారు.

వెంటనే భయపడి దూరంగా జరగటం కూడా తెలియదు. వఠ్ఠి గుమాస్తా!

---

